# పండగ సరదా!

"నాన్నకి పెళ్ళి అవుతూందని సంబరమేగాని అమ్మకి సవతి వస్తూందన్న జ్ఞానం లేదు!" అని తిట్టుతూ ఉండేది మా అవ్వ! పండగ వస్తూందంటే నా కెప్పుడూ ఈ సంగతి జ్ఞాపకంవచ్చి నవ్వు వస్తుంది. వినడానికీ అనడానికీ గమ్మత్తుగా ఉన్నా ఈ మాటలో ఎంతో సత్యం ఉంది కదా?

పండగంటే సరదాపడేది ముఖ్యంగా ఆడవాళ్ళే. తరవాత పిల్లలు. చివరికి మగవాళ్ళు! ఎందుకంటే పండగ వస్తూందంటే ఖర్చుకు గుండెనిబ్బరం అలవరచుకోవలసిన అవస్థ మగవాళ్ళది. ఇరుగిళ్ళతోటీ పొరుగిళ్ళతోటీ పోటీపడి ఖర్చుచేయడానికి ఉబలాటం పడేది ఆడది. వీరిద్దరి మధ్యా పిల్లలు. వాళ్ళకు సరదాయే ముఖ్యంకాని, దాని కయిన ఖర్చు ముఖ్యంకాదు.

పండగలు వస్తాయి. సంవత్సరం పొడుగునా వస్తూనే ఉంటాయి. ఇలా వచ్చే పండగలకోసం కొంచెం ముందుగానే ప్లాను వేసుకుని ఎదురుచూడ్డం మంచిది. సంవత్సరంలో కొనుక్కునే బట్టలు ఈ పండగల దృష్ట్యా చూసి కొనుక్కుంటే పండగనాడు దిగాలుపడిపోకుండా 'నలుగురితోపాటూ నారాయణా' ఏదో ఒకటి అని నిరుత్సాహపడిపోకుండా హుందాగా ఉండవచ్చు. కొనుక్కునేటప్పుడే జాగ్రత్తగా ఉపయోగపడేవీ, మన్నేవీ, ఫాషనుగా ఉండేవీ కొనుక్కోవాలి. అప్పుడే కొనుక్కున్న మరునాడే ఆ బట్టంటే ముఖం మొత్తదు. 'అయ్యో, పాడయిపోతుంది' అని దాచిదాచిపెట్టి పూజ చేయనూ అక్కరలేదు. సరదా వేసినప్పుడల్లా, ఎక్కడికి వెళ్ళాలన్నా కట్టుకుందుకు పనికివస్తాయి. ఇలా ముందుచూపు లేకుండా పెద్దమొత్తం పెట్టి ఏ ఒక్కటో అరో చీర కొనుక్కుని సంవత్సరానికొకసారికూడా ఆ చీర కట్టుకునే అవకాశం రాక ఇబ్బంది పడవలసి ఉంటుంది. 'క్రిస్మస్‌కి అని నూటడెబ్బయిపెట్టి కొన్నాను' అంటూ చెపుతారు. కాని ఏం ప్రయోజనం? దాన్ని మళ్ళీ అలాంటి పండగలకీ, పెళ్ళిళ్ళకీ తప్ప కట్టుకుందుకు ఉండదు. మళ్ళీ క్రిస్మస్ వస్తుంది. మళ్ళీ ఇంకో చీర ఇలాంటిదే తయారవుతుంది! కట్టుకుందుకు పట్టుమని పది చీరలు ఉండనివాళ్ళు ఇలా పెద్దమొత్తాలు ఒక చీర మీద పెట్టడం నిష్ప్రయోజనం. అలాకంటే — ఓ నాలుగు మంచిచీరలు కొనుక్కుంటే వాడుకుందుకు ఉంటాయి. పండగకి చీరలు కొన్న సరదా ఉంటుంది. చీరలు కొనేటప్పుడు — ధైర్యంగా ఉండేవాళ్ళు — చీర అందమే చూస్తారు. అది తమకి నప్పుతుందా లేదా అని ఆలోచించరు. ఇది ఒకరకంగా మెరుగే. అందమైన చీర ఎవరు కట్టుకున్నా అందంగానే ఉంటుంది. ఇక అలా కొనగలిగి, తీరా దాన్ని కట్టుకునే ధైర్యం పోతుంది మరికొందరికి. కొన్నప్పుడు ఎంతో బాగున్న చీర కాస్తా కట్టుకునేటప్పుడు 'గాడీ'గా తోస్తుంది. ధైర్యంచేసి ఏ సందర్భంలోనూ కట్టుకోలేరు. ఇలాంటివాళ్ళు ఎప్పుడూ జాగ్రత్తగా ముందు ఆలోచించుకుని బజారుకు వెళ్ళాలి. లేకుంటే భర్త ఏ చీర తెస్తే దాన్ని సంతోషంగా స్వీకరించాలి. అంతే కాని కొట్టుమీదికి వెళ్ళి వందల చీరలు చూసీ, నచ్చినచీర కొని కట్టుకుందుకు వెనకతీసే పరిస్థితిలో పడకూడదు. మనకు కట్టుకుందుకు పనికిరానిది కొట్లో ఉండడమే మంచిది!

ఇక పిల్లలకు బట్టలు కొనడం ఈ రోజుల్లో ఫార్సుగా ఉంటూంది. ఫాషను కదా అని నైలెక్సు, నైలాను గౌనులు కొంటారు. కాని ఎదిగే పిల్లలకు అంత ఖరీదైన బట్టలు శుద్ధదండుగ. నేనెప్పుడూ పండగలకు కూడా 'మంచి బట్ట'లే కుట్టిస్తానని నన్ను చూసి నవ్వుకుంటారు. కాని చిన్నవాళ్ళకు ఓ పది జతలు ఉండడం ముఖ్యం. "ఎక్కడికైనా వెళ్ళేటప్పుడు వేసుకునే బట్టలు" అంటూ అన్నీ మడతలుపెట్టి ఉంచితే — తీరా మనం తొడగపోయేసరికి వాళ్ళకు మోకాళ్ళపైకి పోతాయి! ఖరీదైన బట్టలు — పట్టు పరికిణీలలాంటివి — మడతవేసి కుట్టించినా కొంచెం ఉపయోగంగాని నైలానులలాంటివాటికి తాత్కాలిక విలువతేకాని కాలం గడిస్తే నాటికి హుందా ఉండదు. పిల్లలకు వాళ్ళకు ఇష్టంవచ్చినవి మనం కొనడంకాదు; మనం మంచివనుకున్నవి వాళ్ళకు కొనాలి. అది ముఖ్యం. అంతమాత్రంచేత తల్లిదండ్రులకు పిల్లలంటే అభిమానం లేదని అనుకోనక్కరలేదు.

పాపం! మగవాళ్ళు. పండగల్లో ఆడవారికి ఉండే హడావిడి మగవారికి ఉండదు. సహజమే. ఆర్థికమైన ఈతిబాధలకు తల ఒగ్గవలసినది మగవాడు. అటు సంఘంలో ఇటు ఇంట్లో తన గౌరవానికీ, తనవారు ఎదురుచూసినదానికీ తక్కువ కాకుండా కత్తిమీద సాము చేయవలసిన అవస్థ మగవాడిదే. ఈ రోజుల్లో భర్తలకు కూడా భార్యలే బట్టల ఎన్నిక చేస్తున్నారు. (ఈమధ్య అత్యధిక సంఖ్యలో వస్తున్న వ్యంగ్యచిత్రాలు చూస్తే మీకే తెలుస్తుంది!!) అలా కొనేటప్పుడు గృహిణులు ఫాషను కదా అని పువ్వుల చొక్కాలు కొనేసి కూచోకూడదు! అయ్యగారు సర్వసాధారణంగా ఎటువంటివి వేసుకుంటారో అవే కొనడం నేర్చుకోవాలి. పక్కింటి అమ్మాయితోటీ పిన్నిగారితోటీ మనకుగాని పోటీ మగవాళ్ళకు ఉండదు. ఫాషను కదా అని బ్లీడింగ్ మద్రాసు షర్టు కొంటే — దాన్ని కనీసం చలి వేయకుండా తొడుక్కుందుకు కూడా ఇబ్బంది పడతారు మావారు! పాపం! వారి తప్పేంలేదు. ఎప్పుడూ కొంగ రెక్కలలాంటి తెల్లని బట్టలకు అలవాటుపడ్డ ప్రాణం ఫాషనుపేరిట తల ఒగ్గలేదు! ఈ వస్త్రధారణ విషయంలో స్త్రీలకూ, పురుషులకూ నిజంగా ఏనుగుకూ దోమకూ ఉన్నంత తేడా ఉంది! గ్రహించండి.

కొనుక్కోవడం ఒక ఎత్తు. వాటిని అందరికీ తృప్తి కలిగించే విధంగా కట్టుకోవడం ఒక ఎత్తు! పండగపూటా పేచీపెట్టి కొనుక్కున్న దైనాసరే చీర హాయిగా కట్టుకునే ఆడవాళ్ళు చాలా అరుదు. పగలంతా వంట ఇంట్లో మగ్గుతారు. మధ్యాహ్నం అలసట. సాయంత్రం ఎందుకని ఓసారి చుట్టపెట్టుకుని విప్పి దాచేస్తారు! నిజమేనా?

పండగకు ముందురోజు ఏం వండాలన్నది ఊహామాత్రంగానైనా అనుకోవాలి. ఉదయం కొంచెం పెందరాళే వంటలు ముగించి చక్కగా కొత్తచీర కట్టుకోవాలి. కనీసం శుభ్రమైన చీరైనా కట్టుకోవాలి. 'చీర కట్టుకోలేదేం?' అని అడిగించుకోకూడదు. 'ఎప్పుడైనా కట్టుకోవచ్చు' అనుకోకూడదు. ఎప్పుడో కట్టుకోడానికి ఇప్పుడెందుకు కొనుక్కోవడం? జీవితం అనుభవించడానికి; దాచి పెట్టడానికి కాదు. రోజురోజుకు కాలచక్రం ముందుకు దొర్లుతుందిగాని వెనక్కు వెళ్ళదు. గడిచిన రోజు తిరిగిరాదు. ఇది జ్ఞాపకం పెట్టుకుంటే మనస్సులో బాధపడడాలూ, అయిష్టంగా సంసారాలు సాగించేయడాలూ, ముక్కులూ మూతులూ విరుచుకోడాలూ ఎక్కడివక్కడ ఎగిరిపోతాయి. ఈ ఉన్న కొద్ది కాలంలో ఆనందించే వ్యవధి తక్కువ. ఇక పంతాలూ పట్టింపులూ అంటూ దాన్ని తరిగించుకోవడం చేతకానితనం కదా?

'పండగపూటా ఏమిటలా!' అనిపించుకోకుండా సాధారణంగా గృహిణులు ఉండలేరు. ఈ నూతన సంవత్సరంలో అలా అనిపించుకోకూడదని నిశ్చయం చేసుకోండి. మీ సంసారాలు 'పొంగో పొంగల్'గా *ఉంటాయి. అంతకుమించి భువిమీద దివి వేరే ఉండదు.* **పండుగసరదా అందరికీ పంచండి!** ★

**—కె. రామలక్ష్మి**

మామగారిపై మీ కెంత అధికారమో మావారిపై నాకూ అంతే!

చిత్రం—గిరిదేవ్ (సికిందరాబాదు-17)

